# మానవుని లక్ష్యము, గమ్యము స్వస్వరూప సందర్శనమే!

**సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం**
**సచ్చిదానందరూపం అద్వైతం సత్యం శివం సుందరం.**

ప్రేమస్వరూపులారా!

మానవజీవితము చాలా ఉత్కృష్టమైనది. సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి మానవజన్మమెత్తియు తన రహస్యము గుర్తించుకోలేకపోవటం నిజముగా దురదృష్టమనే చెప్పవచ్చు. మానవుని గమ్యము, మానవుని లక్ష్యము స్వస్వరూప సందర్శనమే! అట్టి సత్యము గుర్తించక లౌకికము, భౌతికము, ప్రాకృతికము చిక్కులందు చిక్కి తన నిజస్వరూపము తాను గుర్తించుకొనలేక అనేక నష్టములకు, కష్టములకు గురి అవుతున్నాడు, మానవుడు. మానవుడు తరించుటకై నవవిధ మార్గములు ప్రబోధించి మహర్షులు ప్రచారము చేసి లోకమంతా ప్రసరింప చేస్తూవచ్చారు. ఇందులో ఏ ఒక్క మార్గమైనా మానవుడు అనుసరించి, ఆనందించి, ఆచరించి సార్థకతను పొందవచ్చు.

**కలియుగమందు నామస్మరణకు మించిన సాధనలేదు**

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.**

దివ్యమైన సన్నిధి పొందటానికి అట్టి పెన్నిధి మనము అనుభవించటానికి సరైన సులభమైన మార్గము నామస్మరణే.

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్**
**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా**

srisathyasaivachanamrutam

కలియుగములో నామస్మరణకు మించిన సులభమైన మార్గము మరొకటి కానరాదు. పండితుడుమొదలుకొని పామరునివరకు, అజ్ఞానిమొదలుకొని జ్ఞానివరకు, నిరక్షరాస్యునిమొదలుకొని విద్యావంతునివరకు ఈ నామస్మరణ అత్యంత సులభమైనది. ఇలాంటి పవిత్రమార్గమును మానవుడు ఈనాడు విస్మరించి, ప్రాకృతమైనవి క్షణికమైనవి విశ్వసించి తన జీవితమును కోల్పోతున్నాడు. 'అనపేక్ష శుచిర్దక్ష'. భగవంతునికి ఎలాంటివారు ప్రియులు? ఎట్టి అపేక్షలులేని మానవుడు కనిపించడు. యిష్టమైనవో, శ్రేష్ఠమైనవో కొన్ని ఆశలు ఉండే ఉంటాయి. భౌతికమైన యింద్రియములనుభవించే అనుభూతులన్నీ క్షణికమైన సుఖమునందిస్తుంటాయి. ఇవి కేవలము అస్థిరమైనవి. అశాశ్వతమైనవి. క్షణభంగురమైనవి. ఇట్టి వాంఛలనే అనేకమంది వాంఛిస్తుంటారు. కానీ దీనికంటే అతీతమైనది, ఇంద్రియాతీతమైనది శ్రేయోమార్గము. అదే శ్రేష్ఠమైనది. ఏ కర్మలు ఆచరించినా 'సర్వకర్మభగవత్ప్రీత్యర్థమ'నే భావముతో మనము ఆచరించినప్పుడు శ్రేష్ఠమైన కర్మలుగా రూపొందుతాయి. ఏ కర్మలు ఆచరించినా కేవలము భగవత్కర్మలుగానే విశ్వసించాలి. అలాంటి భావముతో మనము కర్మలు ఆచరించినప్పుడు యితను అనపేక్షుడే అవుతాడు.

**సుఖదుఃఖములకు పొంగక, క్రుంగక సత్యాన్వేషణ సల్పటమే సరైన దీక్ష**

స్వార్థము, స్వప్రయోజనము లేక కేవలము దైవప్రేమ నిమిత్తమై, దైవసాక్షాత్కార నిమిత్తమై, దైవానందనిమిత్తమై ఆచరించే కర్మలు అనపేక్షక్రిందనే చేరుతాయి. అపేక్ష లేకుండా కర్మలు చేయటము అసాధ్యము. అపేక్షలు ఉండవలసిందే! అయితే వాటిని భగవత్ప్రీత్యర్థంగా చేయాలి. ఇవన్నీ అనపేక్ష క్రింద చేరతాయి. రెండవది శుచి. అంతర్బహిశ్శుచి కావాలి. ముఖ్యముగా బాహ్యశుచి లేకపోయినా అంతర్‌శుచి అత్యవసరము. ఒక టంబ్లరులో నీరు పోసినామంటే టంబ్లరు బయట శుచిగా లేకపోయినా అందులోపల శుచిగా నుండినప్పుడు సుక్షేమాన్ని అందిస్తుంది. భగవంతుడు కోరేది ఏమిటి? అంతర్‌శుచి. ఇది రెండవగుణము. అనపేక్ష, అంతర్‌శుచి రెండు ఉండినవాడు భగవంతుని ప్రేమకు పాత్రుడౌతాడు. మూడవది ద్రష్ట. అనగా ఒకవిధమైన

దీక్షపూనినవాడు. ఎట్టి పరిస్థితులందైనా దైవచింతన విడువక పరోపకారసంబంధమైన కార్యములలో పాల్గొంటూ మనము నిష్కామకర్మలు ఆచరించటము పెద్ద దీక్ష. సర్వకాలసర్వావస్థలందుకూడను మన సంకల్పములకెట్టి అభ్యంతరములు జరిగినప్పటికిని దానిని లెక్కచేయక తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగినవ్యక్తియే భగవత్ప్రీతికి పాత్రుడు. దుఃఖమునకు కృంగక ఆనందమునకు పొంగక సమత్వము భావించి సత్యాన్వేషణ సల్పటమే సరైన దీక్ష. 'ఇట్టివాడు నాకు మహాప్రియుడు' అన్నాడు గీతాచార్యుడు. ఇంక ఐదవవాడు ఎవరు? ఎట్టి అపేక్షలు లేనివాడు, అంతర్‌శుచి కల్గినవాడు. దీక్ష కల్గినవాడు. దీక్షద్వారా సంబంధబాంధవ్యము కొంత దూరమైపోతుంది. దీనివల్ల దేనితోను సంబంధము లేక సాక్షీభూతుడై ఉంటాడు. మంచి చెడ్డలతోగానీ, కీర్తి ప్రతిష్ఠలతోగానీ, ఐహిక ఆముష్మికములతోగానీ సమాజముయొక్క దీనితోగానీ ఏ విధమైన సంబంధము లేకుండా సాక్షీభూతుడై ఉంటుండాలి. ఎట్టి రాజకీయములలోగానీ, ఎట్టి భౌతికవాంఛలందుగానీ మనస్సును ప్రవేశింపచేయకూడదు. దీనినే ఉదాసీనత అన్నారు. దీనిని లక్ష్యము చేయకూడదు. పదిమంది మనలను వర్ణించనీ లేక పదిమంది మనలను దూషించనీ, దూషణభూషణతిరస్కారపురస్కారములకు లెక్కచేయక దైవచింతనలో జీవితము సాగించాలి. 'ఇట్టివాడు నాకు పరమ ప్రియుడు అన్నాడు', కృష్ణుడు. ఉపేక్షను ఆధారముగా తీసుకొని నిత్యజీవితములో సాధనలు కొనసాగించాలి.

## మనయందే దైవమున్నాడనే సత్యమును గుర్తించి వర్తించటము అత్యవసరము

ఐదవది, సర్వవిధములైన అహంకార, మమకారములకు అవకాశము యివ్వకుండా చూచుకోవాలి. 'నేను చేసే కర్మఫలితము నాకే దక్కాలి', అనే అభిలాష ఉండకూడదు. 'నేను చేశాను', అనే అహంకారమునకు అవకాశము ఉండకూడదు. 'నేను' అనే అహంకారమునకు, 'నాది' అనే మమకారమునకు అవకాశము ఇవ్వకుండా ఉండాలి. 'సర్వము నీదే; నాది అనేది ఎక్కడుంది? నాది ఏదీ లేదు', అనే భగవతర్పితమైన భావముతో భగవత్ప్రీత్యర్థముగా చింతన చేస్తూరావాలి. అలాంటి వారు మాత్రమే దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన దైవత్వమును గుర్తించుటకు వీలవుతుంది. ఈనాడు మనము చేయుచున్న సమస్త

srisathyasaivachanamrutam

సాధనలు దైవాన్ని పొందే నిమిత్తము. కానీ మనము పొందనక్కరలేదు. ఈ జన్మము రావటమే దైవమును పొందినట్టే! 'జంతూనాం నరజన్మ దుర్లభం'. మానవాకారము ధరించిన ప్రతిస్వరూపము దైవస్వరూపమే! 'దైవం మానుషరూపేణా'. కనుక, మనము దైవాన్ని వేరే పొందనక్కరలేదు. మనయందే దైవమున్నాడనే సత్యాన్ని గుర్తించి వర్తించటము అత్యవసరము. అయితే, దైవము ఎక్కడున్నాడు? ఎక్కడో బయట ప్రదేశములో లేదు. మందిరాల్లో లేదు. క్షేత్రాల్లో లేదు. తీర్థాల్లో లేదు. దైవము ఉండే స్థానము ఒక్కటే! అదే హృదయస్థాయి. అదే దైవము. 'ఈశావాస్య మిదం సర్వంజగత్' 'ఈశ్వర స్సర్వభూతానాం' సర్వభూతములందు దివ్యత్వమైన దైవత్వము ప్రకాశిస్తున్నాది. ఇట్టి హృదయములోనుండిన దైవమును విస్మరించి ఎక్కడో ఉన్నాడని పరుగెత్తి పోవటము పెద్ద అజ్ఞానమే! అన్నింటికంటే అత్యంత సమీపములో ఉంటున్నాడు భగవంతుడు మీకు. అయితే భగవత్ప్రీతికరమైన పనులు మనము చేయాలి. ఎవరికి నీవు సేవచేసినా భగవత్సేవగా భావించాలి. అందువల్లనే ఉపనిషత్తులు 'సర్వజీవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అన్నాయి. ఎవరికి మనము నమస్కారము చేసినా భగవంతునికి చేసినట్లే. అంతేకాదు. 'సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అనికూడా చెప్పాయి. మంచిగానీ, చెడ్డగానీ మన కర్మలఫలితమునందే ఇమిడి ఉంటున్నది.

**మంచి చెడ్డల ఫలితము మన కర్మలద్వారానే లభిస్తున్నది**

పాపము, పుణ్యము అని మనం అనుకుంటున్నాం.

> **పాపపుణ్యములన పరదేశమున లేవు**
> **తాను చేయు పనుల దగిలియుండు**
> **వేపవిత్తు నాట వెలగవృక్షము కాదు**
> **కర్మఫలము వలన కలుగు జన్మ.**

ప్రతి ఒక్కటి మన కర్మలయందే తోడై ఉంటున్నాది. మంచిచెడ్డలఫలితము మన కర్మలద్వారానే లభ్యమవుతున్నాది. మంచికర్మలు చేసి దైవత్వమును గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇలాంటి మంచి కర్మలు ఆచరించే నిమిత్తమై ఈనాడు అనేక రకములైన



sri sathyasai vachanamrutam

సాధనలు మనము సల్పుతున్నాము. పాదుకల ప్రతిష్ఠ అంటున్నాము. ఈ పాదుకల ప్రతిష్ఠ ఈనాడు నూతనముగా వచ్చినది కాదు. ఋషులు ఆచరించి అనుభవించి లోకమునకందించినదే! పాదములనాశ్రయించే ఋషులు తపస్సిద్ధిని సాధిస్తూ వచ్చారు. ఇంతేకాదు, దక్షిణామూర్తి తత్త్వమునందు పాదుకలపూజ, గురువుయొక్క పూజ ప్రధానంగా బోధిస్తూవచ్చాడు. శంకరాచార్యులుకూడా పాదుకల ప్రతిష్ఠకు దీక్ష పూనాడు.

**ఈశ గిరీశ నరేశ పరేశ సురేశ విభో**
**సాంబ సదాశివ శంభో శంకర**
**శరణం మే తవ చరణయుగళం**

నీ చరణములే నన్ను ధన్యము చేసే మార్గము. నీ చరణములు నా హృదయమునందే ఉన్నవి కానీ, కైలాసమునందు లేవు. వైకుంఠమునందో స్వర్గమునందో లేవు. స్వర్గము, కైలాసం, వైకుంఠము కేవలము పేర్లు మాత్రమే! నీ హృదయమే స్వర్గము, నీ హృదయమే కైలాసము. నీ హృదయమే వైకుంఠము. హృదయమందే సర్వము ఉంటున్నాయి. సమస్త ప్రపంచము మన హృదయమందే ఇమిడి ఉంటున్నది.

**కర్మమార్గములో ప్రవేశించి, భక్తిమార్గములో హృదయాన్ని నింపుకుని జ్ఞానమార్గములో కైవల్యాన్ని పొందాలి**

రాముడు అయోధ్యకు రానని చెప్పినప్పుడు భరతుడు చాలా పట్టుపట్టాడు. కానీ, రాముడు తాను రానని పట్టుపట్టాడు. రాముడు, భరతుడు ఇద్దరు అన్నదమ్ములే కదా! రామునికి ఎంత పట్టుదలో భరతునికి అంత పట్టుదల. యిద్దరిని గుర్తించుకుంటూ వచ్చిన వశిష్ఠులవారు 'భరతా! తండ్రి ఆజ్ఞ శిరసావహించి అరణ్యవాసం చేస్తున్నాడు రాముడు. అతనిని నొప్పించుట మంచిది కాదు. అతని పాదుకలే మనం అయోధ్యలో ప్రతిష్ఠించుకుందాం. ఆ పాదుకలే రాజ్యాన్ని పరిపాలిస్తాయి', అని ఒక చక్కని ఉపాయం పన్ని భరతునిచేత పాదుకలు తీసుకుపోయి అయోధ్యలో ప్రతిష్ఠ చేయించాడు. కనుక, ప్రాచీన కాలమునుండి పాదసేవ అనేదిగాని పాదముల ప్రతిష్ఠ అనేదిగానీ వస్తున్నాది భారతదేశములో. తరతరములనుండి పేరుగాంచిన భారతదేశమునందు అనేక

sri sathyasai vachanamrutam

దేశములకు ఆధ్యాత్మిక సిరిసంపత్తిని బోధించి, ప్రచారము చేసి, నేటివరకు ఆధ్యాత్మికతత్త్వము నిలబెట్టినవి, ఈ పాదుకలు. ఇలాంటి పవిత్రమైన భారతసంస్కృతిని భారతీయులు విస్మరించారు. గురువుదగ్గర విద్యలునేర్చి తిరిగి తను గృహస్థాశ్రమములో ప్రవేశించే శిష్యులు గురుపాదుకలు తీసుకువెళ్ళి నిత్యము ఇంటియందు పూజచేసి గురుతత్త్వమును గుర్తు చేసుకునేవారు. అయితే ఇవన్నీ బాహ్యసంబంధమైన తత్త్వములు. నిజమైన సంబంధము ఏమిటి? హృదయస్థాయిలో ఈ పాదుకలు ప్రతిష్ఠ చేసుకోవాలి. బాహ్యముగా ప్రారంభము చేసి తిరిగి అంతరాత్మలో అంత్యము గావించుకోవాలి. ఇదంతా కేవలము కర్మమార్గమునకు సంబంధించినది. కర్మమార్గములో ప్రవేశించి భక్తిమార్గములో హృదయాన్ని నింపుకొని జ్ఞానమార్గములో కైవల్యమును పొందాలి. 'జ్ఞానాదేవతు కైవల్యం' అన్నారు. ఎంతకాలమైనా లౌకికమైన, ప్రాకృతమైన కర్మలందే మన జీవితము అంత్యము చేయకూడదు. ఒక తరగతి తరువాత మరొక తరగతికి పోయినట్లుగా ఒకదాని తరువాత మరొకస్థాయికి పోవాలి. కర్మ, ఉపాసన, జ్ఞానము ఈ మూడింటితత్త్వాన్ని గుర్తించుకోవాలి. అయితే సామాన్య మానవులు కర్మనే ఆచరిస్తున్నారు. కాయము ధరించినది కర్మనిమిత్తమే! 'కర్మానుబంధీని మనుష్యలోకే'. కనుక, ఈ దేహముచేత ప్రాకృతకర్మలాచరించి దివ్యమైన మానసికతత్త్వమును అర్థము చేసుకోవాలి.

**ధర్మార్థకామమోక్షములు ధర్మముపైననే ఆధారపడి ఉన్నాయి**

కనుక, ప్రతి మానవుడు ప్రప్రథమములో కర్మమార్గములో ప్రవేశించాలి. భగవంతునికి ప్రీతికరమైన కర్మలు మనం ఆచరించాలి. ఏది భగవంతునికి ప్రీతికరమైనది? ఏ పని చేసినా ఇది భగవంతుని ప్రీతికోసం చేస్తున్నాను అని భావించాలి. మొట్టమొదట నీవు చింతించు, 'నేను చేసేపని భగవంతునికి ప్రీతిగా ఉంటుందా లేదా?' నీ అంతరాత్మ తృప్తిని నీవు మొట్టమొదట గమనించాలి. ఈ విధముగా పరీక్ష చేసుకొని తరువాత ముందుకు నడవాలి. మనము ఏ పనిచేసినా చిత్తశుద్ధితో చేయాలి. ఇతరుల ప్రోద్బలముతోగానీ యితరులయొక్క వత్తిడితోగానీ మనము ఏమాత్రము దీనిలో ప్రవేశించకూడదు. నీకు inside నుండి వచ్చే source గానీ బయటనుండి వచ్చే force కాదు. ఈ విధమైన సేవలలో మన

sri sathyasai vachanamrutam

సుబ్రహ్మణ్యశెట్టిగారు పాదుకల విషయములో చాలా అభివృద్ధి గావిస్తూ వచ్చారు. ఆయన వయస్సు చూస్తే యిప్పటిలో యింత ప్రయాణము చేసే శక్తిలేదు. కానీ భక్తి విశ్వాసములు, ప్రపత్తిచేత యిటువంటి పనులకు తాను పూనుకుంటున్నాడు. ఆ దివ్యమైన శక్తియే తన శరీరమునకు ఇంతటి బలమునందిస్తూ వస్తున్నది. ఇలాంటి పవిత్రమైన మార్గములో ప్రతి మానవుడు ప్రవేశించి దైవమునకు సన్నిహితుడు కావాలి. దైవానికి సన్నిహితుడు కావాలంటే అతని ప్రేమకు సంబంధించిన పనులలో మనం ప్రవేశించాలి. భారతీయసంస్కృతియందు 'సత్యంవద', 'ధర్మంచర' అన్నవి మూల సూత్రములు. సత్యమును మనం తప్పకుండా ధర్మమును మనం వీడకుండా ఉండాలి. ఏ పనులు చేసినా సత్యమునకు, ధర్మమునకు సన్నిహిత సంబంధముగా ఉండాలి. మానవునకు గృహస్థాశ్రమములో నాలుగు విధములైన పురుషార్థములుంటున్నాయి, ధర్మార్థకామమోక్షములని. చతుర్విధపురుషార్థములందు మొట్టమొదటిది ధర్మము. ఆ ధర్మమే పాదము. ధర్మముపైనే దేహమంతా ఆధారపడి ఉంటున్నాది. పాదములేక దేహము నిలువలేదు. ఆ ధర్మమునకు సంబంధించినదే అర్థము. ఉదరమే కామము. ఏ పనిచేసినా ఉదరపోషణార్థమై చేస్తున్నాము. ఉదరము భుజబలముపై ఆధారపడి ఉంటున్నాది. భుజబలమే క్షత్రియత్వము అని. కాబట్టి ధర్మార్థకామమోక్షములు ధర్మముపైనే ఆధారపడి ఉంటున్నాయి. ఈనాడు ధర్మమును విడిచిపెట్టి, మోక్షమును విస్మరిస్తున్నారు. కేవలము అర్థకామములను మాత్రమే పట్టుకొని జీవిస్తున్నారు. అర్థకామములుండి ప్రయోజనము ఏమిటి? ధర్మమనే పాదములు, మోక్షమనే శిరస్సు అత్యవసరము. అదే బ్రహ్మతత్త్వమన్నారు. 'బ్రాహ్మణోస్యముఖమాసీత్' దేహములో బ్రాహ్మణత్వము మన ముఖమే. అదే బ్రహ్మతత్త్వము. బ్రహ్మస్థానమనే శిరస్సు మోక్షమునకు మూలము. పాదములు ధర్మముతోకూడినవి. ధర్మమును ఆశ్రయించి అర్థకామములను ధర్మముతో పోల్చుకొని తద్వారా మోక్షమనే గమ్యమును చేరాలి. మోక్షము ఎక్కడో లేదు. 'మోహక్షయమే మోక్షము'. మనము మోహమును సాధ్యమైనంతవరకు తగ్గించుకోటానికి ప్రయత్నించాలి. ఎట్టి మోహము రావాలి? దైవమోహము రావాలి మనకు. దైవాన్ని మనము ఆశించాలి. దైవాన్ని ఆశించి చేసిన సర్వకర్మలు దైవప్రీత్యర్థమే అవుతాయి. కనుక, ఈ విధమైన భావముచేత మనము పూజలు చేయాలిగానీ ఏదో artificial గా పాదములకు

sri sathyasai vachanamrutam

పూజచేస్తే చాలు అని అనుకోకూడదు. ప్రాచీన భారతీయసంస్కృతి art కి సంబంధించినదిగాదు, heart కి సంబంధించినది. ఏదో ఒక నిర్బంధముగా చేయటంకాదు, heart నుండి రావాలి ఈ భావాలు. మనము ఈ సాధనలో ఏమి చేసినా దైవవిశ్వాసముతో చేసుకోవాలి. ఇదే అనపేక్షకు సరైన అర్థమునిస్తుంది.

**ఈనాడు కావలసింది ఆకారమానవులుకాదు, ఆచారమానవులు**

మానవుడు ఎట్టి అపేక్షలు లేకుండా జగత్తులో జీవించటానికి వీలుకాదు. కేవలం చెప్పవచ్చుగానీ ఎవరూ చేయలేరు

**చెప్పవచ్చు కోటి చేయరు ఒక్కటి**
**చెప్పుట సులభము చేయుట కష్టము**
**ధాతకైన వాని తాతకైన.**

మనకు చెప్పుట సులభము. చేసేది చాలా కష్టము. మొట్టమొదట చేయటములోనే మన శక్తిని నిరూపించాలి. ఈనాడు ఆచరణ చాలా అవసరము. ఆకారమానవులు కాదు కావలసింది, ఆచారమానవులు కావాలి. నిజముగా ఆ మంత్రములు చెబుతుంటే ఏ భాష తెలియనివానికైనా హృదయాన్ని కరగింప చేస్తుంది. అందులోనూ మన పండితులు ఎంత సుస్పష్టంగా చెబుతుంటారు! నిజముగా మీరు వేరుగా భావించకండి. తమిళనాడులోగానీ కేరళలోగానీ అన్ని ప్రదేశాల్లో చూచాను. కానీ, ఎక్కడా సంస్కృత ఉచ్చారణ అంత సరిగా ఉండదు. కానీ, ఈ పండితుడు అంత సుస్పష్టముగా చెబుతున్నాడు. ఒక్కొక్క పదము చక్కగా హృదయమునకు హత్తుకునేటట్లుగా చెబుతుంటాడు. అతని అనుచరులు అందరూ దీనినే అనుసరిస్తూ వస్తున్నారు. మేము బూర్గుల రామకృష్ణరావు కేరళలో గవర్నరుగా ఉన్నప్పుడు వెళ్లాము. అక్కడ నంబూద్రి బ్రాహ్మణుడు సంస్కృత పండితుడు. గొప్ప పండితుడు. అతడు మంత్రాలు చెబుతుంటే రామకృష్ణరావు చెవులు మూసుకున్నాడు, పాపం! 'పండితుడా! మా సంస్కృత మాతను చంపకండి' అన్నాడు. ఆ పండితుడు 'జాంతాకారం భుజగబయనం పద్మనాభం...'. 'శాంతాకారం భుజగశయనం' అని చెప్పవలసింది. సంస్కృతమును ఎంత హీనం చేసినట్టు, చూడండి! తమిళనాడులో



sri sathyasai vachanamrutam

ఉంటుంది ఈ పండితుడు ఇంత సుస్పష్టంగా చెబుతున్నాడంటే ఆంధ్రులకంటే గొప్పగా చెబుతున్నాడు. అలాంటి పండితులు ఉండటంచేత మా సుబ్రహ్మణ్యశెట్టికి చాలావరకు బాధ్యత తగ్గిపోతూ వస్తున్నాది. ఈనాడు తెల్లవారి చాలా ఆనందకరమైన దృశ్యము. అది ఏదో ఒక వైకుంఠములోనో స్వర్గములోనో ఉండినట్లుగా కనిపించింది. అందరూ ఎవరికి వారే నిశ్శబ్దముగా కూర్చుని పూజలు చేస్తూవచ్చారు. ప్రతి పదమునకు అర్థము చెబుతూవచ్చాడు పండితుడు. ఈ విధంగా అర్థము చెప్పి బోధించి ఆచరణలో దింపేవారు దొరకటం చాలా కష్టము, ఈనాడు. మన భారతదేశము మొదటినుండి యిదే అవస్థకు గురైంది. సమాజముయొక్క సంక్షేమాన్ని ఎవరూ గుర్తించటంలేదు. వారి duty వారు చేసుకుపోతున్నారు. కాని, ఈ పండితుడు మాత్రం ప్రతి పదమునకు అర్థమును హృదయమునకు హత్తుకునేటట్లు చెప్పి చక్కగా పూజ చేయిస్తుంటాడు. ఇలాంటి వారు ఉండటంచేత శిష్యులుకూడా అలాగే ఉంటారు. 'యద్భావం తద్భవతి'. నాయకుడు ఎట్టివాడో నాటకముకూడా అట్టిదే అవుతుంది.

**'ఎచ్చట పుట్టె నచ్చటికి పోవ నైజము ప్రాణికోటికిన్'**

ఇంక డాక్టరు గాడియా మీకందరికి తెలుసు. ఇతని తాత షిరిడీలో కాకా దీక్షిత్. అతను చూడలేదు, కానీ నేను చూశాను. ఆ కుటుంబమునకు ఈ అవతారముతోకూడా సంబంధము ఏర్పడిపోయింది. తరువాత కాకా దీక్షిత్తు కుమారుడు 30 సం॥లు బృందావనములో తన భార్యతో జీవించాడు. ఆ కాకా ధీక్షిత్ వ్రాసిన డైరీ తీసుకువచ్చి చూపించాడు. 'నాయనా! నీవు బాబా దగ్గరకు చేరతావు. ఎలాంటి కష్టములు వచ్చినా ఆ స్థానము వదలకు', అని డైరీలో వ్రాసాడు. అప్పుడే డా॥ గాఢియా వచ్చాడు. అప్పుడు నేనే మణిపాల్ వెళ్లి డాక్టరు చదువు చదవమని పంపించాను. ఈ విధంగా చూచుకుంటే అందరికి అన్ని జన్మలలోను స్వామితో సంబంధము ఉంటున్నాది. ఇలాంటి సంబంధమే లేక మీరందరు ఇక్కడకు రావటానికి వీలేలేదు. మీకు తెలియదు, నాకు తెలుసు. ఇది జన్మ, జన్మలనుంచి వచ్చే సంస్కారమే! అనాదికాలమునుండి అందరూ ఆత్మతో సంబంధము కలిగినవారే! ఈ ఆత్మసంబంధము మనము ఏనాడు వదలకూడదు. నీవు ఎక్కడనుంచి

వచ్చావో అక్కడకు పోయి చేరాలి. అదియే భాగవతము చెబుతూ వచ్చింది: 'ఎచ్చట పుట్టెనచ్చటికి పోవ నైజము ప్రాణికోటికిన్'. నీవు ఆత్మనుండి వచ్చావు, ఆత్మను చేరాలి. అంతవరకు కర్మక్షేత్ర యాత్రలోపల నీవు ఏమాత్రము నిర్లక్ష్యము చేయకూడదు. ఈనాడు వచ్చిన త్రోవ మరిచిపోతున్నారు. కొత్తరోడ్లలో వెతుకుతూ పోతున్నారు. చాలామంది నా దగ్గరకు వచ్చి అడుగుతుంటారు: 'స్వామీ! నాకు ఏదైనా మార్గము చూపమని. 'నాయనా! నేను చూపనక్కరలేదు. వచ్చిన మార్గమే పట్టుకుపో! అని చెపుతాను. ఎక్కడనుండి వచ్చావు? నీవు తల్లినుండి కాదు, వచ్చింది. మద్రాసునుండి కాదు, వచ్చింది. దేహము మధురనుండి వచ్చింది. కానీ, నీవు రావటం ఆత్మనుండే! నీవు దేహము కాదు, మనస్సు కాదు. దీనినే వేదాంతమందు 'నేతి', 'నేతి' అన్నారు. నీవు దేహము కాదు, మనస్సుకాదు, బుద్ధికాదు, ఇంద్రియములుకాదు, అంతఃకరణకాదు. నీవు ఆత్మ.

**రాగద్వేషములు, అసూయవంటి దుర్గుణములను దూరము చేసుకుంటే అమృతత్వము పొందుతావు**

'శ్రుణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః'. అమృత పుత్రుడు నీవు. అమృతపుత్రుడైన నీవు అనృతము ఎందుకాశిస్తున్నావు? అమృతమునకు దారి ఏమిటి? What is the way to immortality? Removal of immorality is the only way to immortality. రాగము, ద్వేషము, అసూయ ఇలాంటి దుర్గుణములను మనము దూరము చేసుకుంటే అమృతత్వము పొందుతాము. భగవంతుని మనకు దూరము చేస్తున్నవి ఈ దుర్గుణములే! దుర్గుణములనుండి తొలగిపోతే భగవంతుడు ఎప్పుడూ సన్నిహితుడే! కనుక, క్రమక్రమేణా పశులక్షణాలను దూరంచేసుకొని దైవగుణములు పోషించుకుంటూరావాలి. సత్యము, ధర్మము, న్యాయము, నీతి, నిజాయతీ, త్యాగము ఇలాంటి మానవతా విలువలు పెంచుకోవాలి. కామక్రోధ మదమత్సరములు యివన్నీ మృగలక్షణాలు. కానీ దురదృష్టవశాత్తు అవే మనకు అలవడుతున్నాయి. కోపము ఉంది చూడండి, అది కుక్క లక్షణము. కనుక, నీకు కోపం వచ్చినప్పుడు Iam not dog, I am man అని తలచుకో! కోపం పోతుంది. కొన్ని కొన్ని సమయములలో కోతుల లక్షణాలు వస్తుంటాయి. సామాన్య కోతులుకాదు, పిచ్చి కోతుల లక్షణాలు వస్తుంటాయి. అలాంటి

srisathyasaivachanamrutam

సమయములో I am not monkey, I am man అని తలచుకో! పశులక్షణాలు దూరమైపోతాయి.

## త్రికరణశుద్ధి లేకపోతే జ్ఞానసిద్ధి కలుగదు

ఏ సాధనలు చేయనక్కరలేదు. జపము చేయనక్కరలేదు. తపము చేయనక్కరలేదు. విచారణయందే ఉంటున్నాది సర్వస్వము. మొట్టమొదట విచారణ కావాలి. విచారణ అనగా ఏమిటి. ఏది సత్యము? ఏది అసత్యము? ఏది రైటు? ఏది రాంగు? ఈ రెండింటిని పరిశీలించినప్పుడే మనము సత్యమైన మార్గములో ప్రయాణము చేయగలము. మానవులుగా పుట్టాము. అనేక జన్మల పుణ్యఫలములకు వచ్చిన జన్మము, ఈ మానవజన్మ. ఇలాంటి మానవజన్మ వచ్చి సరైన రీతిలో వినియోగించుకోకుండా పోతే మానవజన్మ వచ్చి ప్రయోజనం ఏమిటి? ఎన్ని జన్మలైనా మానవజన్మే రావాలి. ఒక్కతూరి మనము వచ్చాము చాలు. రెండవతూరి తిరిగి ఆశించకూడదు. ఒక చిన్న ఉదాహరణము. మీకు ఈనాడు న్యూస్‌పేపరు వచ్చింది, చేతికి. న్యూస్‌పేపరు పూర్తిగా చదివావు, మెదటినుండి చివరివరకు. రేపుకూడా అదే న్యూస్‌పేపరు చదువుతావా? కాదు. ఈనాటి న్యూస్‌పేపరు రేపటికి వేస్ట్‌పేపరు. రేపటి పేపరు కావాలి. అదే రీతిగా చదివినది చదవటము, తిన్నదే తినటము. ఈ విధంగా ఉంటే జన్మ ఏవిధంగా సార్థకము? 'పునరపి జననం పునరపి మరణం' ఎప్పుడు ఇదేనా కావలసింది? 'పునర్జన్మ నవిద్యతే' లేకుండా చేసుకోవాలి. దానికోసమే, పూజలు, జపములు, తపములు. మనము పుట్టాము. అదృష్టవంతమైన జన్మము. ఎంతో పుణ్యఫలము ప్రోగుచేసుకొని అందుకున్న మహా బహుమతి. ఇలాంటి జన్మము వ్యర్థము చేసుకోకూడదు. ఏకించిత్ టైము చిక్కినప్పటికి సార్థకమైన పనులలో మనం ఉపయోగపెడదాం. పాదాలు ఆశించి పాదపూజలు చేసి, దివ్యత్వము పొందాలని ఆశిస్తున్నారు. ఎప్పుడు పాదములు నీదగ్గర పెట్టుకున్నావో అప్పుడు ఆ పరమాత్ముడు నీ దగ్గర ఉన్నాడని చింతించాలి. చెప్పులు బయటపెట్టి లోపలకు వస్తున్నావు. చెప్పులు వేరు, నీవు వేరుగా ఉన్నావు. కానీ, భగవంతుని పాదములు అట్లాకాదు. ఎక్కడకూడా ఎప్పుడూ వదలడు. పాదములు పూజరూములో ఉంటే భగవంతుడు పూజరూములో ఉన్నట్లే! ఆ పవిత్రమైన, ఉన్నతమైన భావాన్ని, నిత్య సత్యమైన భావాన్ని, నీవు తలచుకుంటూ రావాలి.

sri sathyasai vachanamrutam

అతను కదలేవాడు, మెదలేవాడు కాదు. 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం'. ఇవన్నీ చెప్పుతున్నాము మనము. కానీ చేయటం లేదు. చెప్పింది చేయాలి. అదే the proper study of mankind is man. Thoughts, words, actions మూడు ఒకటి కావాలి. అదియే ఈనాడు మనం నేర్చుకోవలసినది. మనసులో ఏ పవిత్రభావాన్ని చింతిస్తున్నావో దానిని నోటితో చెప్పాలి. నోటితో చెప్పినది చేతితో చేయాలి. వేదాంతమునందు త్రికరణశుద్ధి అన్నారు. త్రికరణశుద్ధి లేకపోతే జ్ఞానసిద్ధి మనకు లభ్యముకాదు. ఈ పూజలు, వ్రతములు, నోములు ఇవన్నీ చిత్తశుద్ధి నిమిత్తమే; చిత్తశుద్ధి జ్ఞానము నిమిత్తమే!

**సత్సంకల్పములు అందుకు తగిన శక్తిని అందిస్తాయి**

ప్రేమస్వరూపులారా! ఎన్నో జన్మల పుణ్యముచేత ఈ పవిత్రమైన మార్గములో మీరు ప్రవేశించారు. భారతదేశములో ఎంతమంది లేరు? అందరికి అవకాశము చిక్కిందా? లేదు. ఎంతోమందో రావాలనుకున్నవారు cancel చేసుకున్నారు. చిక్కినదానిని దక్కించుకోటానికి ప్రయత్నించాలి. చిక్కటమే చాలా దుర్లభము. చిక్కినదానిని సార్థకము చేసుకోవాలి. ఎంతో కాలము జరగాలి. గాఢియా చెప్పినట్లు 98లో ఎంతో గొప్పగా జరుగుతుంది. దానికి తగినట్టుగా సుబ్రహ్మణ్యశెట్టి ఆరోగ్యము చక్కగా ఉంటుండాలి. అతనికి ఆశ ఉంది గానీ శరీరము తట్టుకోలేదు. ఆ సత్సంకల్పము కల్గినప్పుడు ఆ సంకల్పమే సర్వశక్తులను అందిస్తుంది. శాస్త్రిగారుకూడా ఈ విషయములో కంకణము కట్టుకోవాలి. పాదములయొక్క పవిత్రతను యింకా ఎక్కువ ప్రచారము చేసి సరైన అంతరార్థము బోధించి ప్రజలలోని అజ్ఞానమనే చీకటిని దూరము గావిస్తూ రావాలి.

**(తేదీ 03-10-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam